క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


కోరాడ శ్రీనివాస రావు, తహసీల్దార్

విజయనగరం రూరల్: విజయనగరం మండల తహసీల్దార్‌గా కోరాడ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా భోగాపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న కోరాడ శ్రీనివాసరావును విజయనగరానికి.. ఇక్కడ పనిచేసిన సీహెచ్ బంగార్రాజును భోగాపురానికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావుకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

రామాలయ పునః నిర్మాణానికి కోలగట్ల విరాళం


రామాలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న కోలగట్ల

విజయనగరం: నగరంలోని 27వ డివిజన్ పరిధి జొన్నగుడ్డి రుప్పవీధిలో రామాలయ పునః నిర్మాణానికి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం శాస్త్రోక్తంగా పునః నిర్మాణ శంకుస్థాపన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్, కార్పొరేటర్ సునీత, ఆ ప్రాంత పెద్దలు రుప్ప సూరప్పారావు, ఎస్. శ్రీనివాస్, లింగాల చినబాబు, కె. పైడిరాజు, కె.లక్ష్మణరావు, డి.బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లించవచ్చు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భవన యజమానులు ఈనెల 30లోగా వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించవచ్చని కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెల 30తో గడువు ముగియనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పన్ను చెల్లిస్తే రెండు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నగరంలోని భవన యజమానులు సకాలంలో పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

విజయనగరం: ప్రముఖ రంగస్థల కళాకారిణి కలగ కోటేశ్వరీదేవి 11వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన నేత్రవైద్య శిబిరాన్ని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభించారు. 11వ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో నిర్వహించిన నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, నాటకరంగంలో కోటేశ్వరీదేవి మరపురాని ఎన్నో పాత్రలను పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందిందన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కళాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

నిరుపేద బాలికలకు ఆశ్రయం


బాలికల వివరాలు తెలుసుకుంటున్న కేసలి అప్పారావు

గుర్ల: మండలంలోని తాతావారి కిట్టాలి గ్రామానికి చెందిన ఇద్దరు నిరుపేద బాలికలకు ఆశ్రయం కల్పించినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు సోమవారం తెలిపారు. ఈ బాలికల తల్లి మరణించి ఏడాది కావస్తోంది. తండ్రి వారి బాధ్యతలను మరచి, పట్టించుకోకుండా అనాథలుగా వదిలేశాడు. వీరు పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు ఇటీవల గ్రామానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వచ్చిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే జెడ్పీ చైర్మన్ బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ అప్పారావుకు సమస్యను వివరించి పరిష్కరించాలని సూచించారు. ఈమేరకు తాతావారి కిట్టాలిలో అప్పారావు సోమవారం పర్యటించారు. బాలికలకు జిల్లా బాలల సంరక్షణ కేంద్రంలో పునరావాసం కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఇద్దరిని చదివిస్తామని పేర్కొన్నారు.

పూరిల్లు దగ్ధం

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో బోకం దేముడుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఆయన అంత్యక్రియల్లో కాల్చిన బాణసంచా పూరిల్లుపై పడడంతో నిప్పు అంటుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఈ ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, సామగ్రి, నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి.

జగనన్న విద్యాకానుకల పంపిణీ..

- నియోజకవర్గంలో 1 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 15,728 విద్యార్థులకు పూర్తి స్థాయిలో కిట్ల సరఫరా
- తొలిరోజే అన్ని పాఠశాలల్లో పంపిణీ ప్రారంభం


విజయనగరం రూరల్: విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: విద్యారంగంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలు తెరుచుకున్న తొలిరోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించి, వారితో పాటు వారి తల్లిదండ్రుల మోముల్లో ఆనందం నింపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే విద్యారంగంలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన ఎన్నికల హామీల్లో భాగంగా అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. నాలుగేళ్లుగా జగనన్న విద్యాకానుకల రూపంలో నాణ్యమైన విద్యా సామాగ్రిని అందిస్తున్నారు. నాడు - నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్థాయిని కల్పిస్తున్నారు. అలాగే ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి పేదింటి విద్యార్థులకు గ్లోబల్ స్థాయి విద్యను అందిస్తున్నారు.

పంపిణీ మొదలు..

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు విజయనగరం గ్రామీణ మండలాల్లో 125 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 96 మండల ప్రాథమిక పాఠశాలలు, 12 ప్రాథమికోన్నత, 17 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 15,728 మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. వీరికి సోమవారం నుంచే జగనన్న కిట్లను ఆయా పాఠశాలలు విద్యార్థులకు అందిస్తున్నారు.

విద్యకు తొలి ప్రాధాన్యం : ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సారిక గ్రామంలో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ బడుల్లో చదువుకున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలో భాగంగా ఉచితంగా బైలింగువల్ పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు, మూడు జతల యూనిఫామ్, బూట్లు, సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరీతో కూడిన విద్యాకానుక అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: పాఠశాలలు ప్రారంభం రోజే విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందించి, విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మండల, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. మోపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దుకొండ రమేష్, తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం రూరల్: చెల్లూరులో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న బోద అప్పలక్ష్మ


నెల్లిమర్ల రూరల్: అలుగోలులో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు

వైస్ ఎంపీపీ చేతుల మీదుగా...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. అలుగోలు ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. సీతారామునిపేటలో టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నేత రాంబార్కి, రామారావు, తదితరులు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు.


నెల్లిమర్ల రూరల్: సీతారామునిపేటలో కిట్లు అందుకున్న విద్యార్థులతో వైఎస్సార్‌సీపీ నేతలు రేగాన, రాంబార్కి, తదితరులు


నెల్లిమర్ల: జగనన్న కిట్లు అందజేస్తున్న వైస్‌చైర్మన్, తదితరులు

విద్యకు ప్రాధాన్యం

నెల్లిమర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు అన్నారు. పట్టణ పరిధిలోని రామతీర్థం జంక్షన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను వైస్ చైర్మన్ కృష్ణారావు, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, 9వ వార్డు కన్వీనర్ బూర సత్యనారాయణ అందజేశారు.కార్యక్రమంలో హెచ్ఎం జనార్దనరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా..

- వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విజయ్


ద్వారకామయి అంధుల పాఠశాలకు సామగ్రి అందజేస్తున్న అవనాపు విజయ్

విజయనగరం: మున్సిపల్ మాజీ చైర్మన్ అవనాపు సూరిబాబు మార్గంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు అవనాపు విజయ్ అన్నారు. సోమవారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని అవనాపు విజయ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాలలో విజయ్, భార్గవి దంపతులు పాల్గొన్నారు. బుచ్చన్న కోనేరు వద్ద శివాలయం పునర్నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం అందజేశారు. అలాగే ద్వారకామయి అంధుల పాఠశాలలో విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, తలగడలు, చాపలు పంపిణీ చేశారు. ప్రేమ సమాజంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం చేపట్టగా... పేర్లవారి వీధి చెవిటి, మూగ స్కూల్‌లో విద్యార్థులకు దుస్తులు, సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. అనంతరం కల్యాణ వేంకటేశ్వర స్వామి గుడి (రింగ్ రోడ్డు)లో 108 రోజులుగా హరినామ సంకీర్తన చేస్తున్న భజన బృందానికి అన్నదాన ప్రసాదం నిమిత్తం పది వేల రూపాయలు అందజేశారు. పట్టణ నిరాశ్రయుల కేంద్రం (ఫైర్ ఆఫీస్ వద్ద) పేదలకు అల్పాహారం, ఆక్వా వాటర్ ఫిల్టర్ నిమిత్తం 5000 రూపాయల నగదు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు, రొతు శ్రీనివాసరావు (చంటి), రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ గుంపా అప్పలరాజు, కర్రోతు వెంకటరావు, బుజ్జి, శశ్రిష్, ప్రసాద్ ప్రభు, హంసా శ్రీను, బొద్దు రమణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస తహసీల్దార్‌గా శ్రీనివాస్ మిశ్రా

కొత్తవలస: మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్ మిశ్రా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ప్రసాదరావుకు బొండపల్లి బదిలీ కావడంతో అక్కడి నుంచి శ్రీనివాస్ మిశ్రా కొత్తవలసకు వచ్చారు. ఆయనకు హెచ్‌డీటీ రమేష్, ఆర్ఐ రాజేష్, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ద్రవజీవామృతం తయారీపై అవగాహన


మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తవలస: చీడివలస గ్రామంలో వ్యవసాయశాఖ సహకారంతో సబల సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళారైతులకు ద్రవ జీవామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయం ఏపీఎం వెంకటరమణ అవగాహన కల్పించారు. ఏపీఎం మాట్లాడుతూ జీవామృతం సజ్జ నారుమడులను ఎండ తీవ్రత నుంచి రక్షించేందుకు అమృతంలా పని చేస్తుందన్నారు. మొక్క ఎదిగేందుకు కావాల్సిన పోషకాలను అందిస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం


సామాజిక భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని 25వ డివిజన్ రంగాలవీధిలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, 14.5 లక్షల రూపాయలతో సామాజిక భవనం నిర్మించడం సంతోషించదగ్గ విషయమన్నారు. స్థానికుల ఎన్నో ఏళ్లనాటి కల అయిన సామాజిక భవనం ఏర్పాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వల్ల సాకారమైందని చెప్పారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆడారి రుక్మిణి మాట్లాడుతూ, సామాజిక భవన నిర్మాణానికి చొరవ చూపిన కోలగట్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, డివిజన్ ఇన్‌చార్జ్ యడ్ల రాజేష్, స్థానిక నాయకులు ఏఏ రావు, భీశెట్టి ఓం శంకర్, ఆడారి వెంకటేశ్వరరావు, ఎంకేబీ శ్రీను, నగేష్, కాంద్రేగుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


పూసపాటిరేగ: భోగాపురం మండలం పోలిపల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం మండలంలోని పోలిపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే, తదితరులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని రంగాలనూ అభివృద్ధి చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దేశం మొత్తం గుర్తించే విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సుపరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ రావాడబాబు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ప్రజాప్రతినిధులు ఉప్పాడ శివారెడ్డి, ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, పడాల శ్రీనివాసరావు, పడాల భానుప్రకాష్, పతివాడ రామకృష్ణ, కేబుల్ శ్రీనివాసురావు, పిన్నింటి చిన్న, కర్రోతు జగన్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సుందర హరీష్, కొల్లి రామ్మూర్తి, కొండపు కొత్తయ్యరెడ్డి, మైలపల్లి నరసింహులు, షేక్ మదీనా, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని 48వ డివిజన్ 57వ సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు.. నాలుగేళ్లలో ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అంతకుముందుగా లక్ష్మీగణపతి సమేత శివపార్వతుల ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అమ్మఒడి వంటి పథకాలను ఎద్దేవా చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు.. తాజాగా తమ మేనిఫెస్టోలో మళ్లీ అమ్మకువందనం పేరుతో అదే పథకం ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తుండడంతో ఎన్నో సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

భూ రీసర్వేకు సహకరించండి


గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సన్యాసినాయుడు

వేపాడ: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకంలో భాగంగా చేపట్టనున్న సమగ్ర భూ రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సన్యాసినాయుడు కోరారు. బానాది గ్రామంలో భూరీ సర్వేపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి బానాది రెవెన్యూ పరిధిలో సర్వే చేయనున్నామని చెప్పారు. సర్వే చేసే సమయంలో రైతులు తమ భూముల వద్ద ఉండి సిబ్బందితో భూముల వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. మండలంలో రాయుడుపేట, జమ్మాదేవిపేట గ్రామాల్లో సర్వే పూర్తి చేశామని, చామలాపల్లి, అరిగిపాలెం, నీలకంఠరాజపురం గ్రామాల్లో సర్వే కొనసాగుతోందని చెప్పారు.